పాలు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి-జి.మాడుగుల: ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం సందర్భంగా జి.మాడుగుల మండలం శ్రీమత్స్య మడుగులమ్మ ఫోటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, గర్భిణీలకు, బాలింతలకు పాలు, పళ్ళు, రొట్టెలు అందించారు. రెయిన్బో డిజిటల్ రాజు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటోగ్రాఫర్లు ప్రెసిడెంట్ జాన్ రాజ్, సతీష్, కెవిఎస్ఎస్ వి.ప్రసాద్, మత్స్యరాస నారాయణ రాజు, చిట్టిబాబు, రాము, వాసు బాయ్, సింహాచలం, రాజా, నారి,అభి, పవన్, కృష్ణ పాల్గొన్నారు.

అందజేస్తున్న యూనియన్ సభ్యులు

ప్రశాంతంగా ఉప ఎన్నికలు

రెండు చోట్ల వైసిపి, ఒక చోట టిడిపి బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా విజయం - గూడూరులో సిపిఎం మద్దతుదారు వార్డు మెంబర్‌గా గెలుపు

గూడూరులో సిపిఎం బలపరిచిన అభ్యర్థిని అభినందిస్తున్న స్థానికులు

అల్లూరి జిల్లాలో శనివారం సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జికె.వీధి మండలం సీలేరు సర్పంచిగా వైసిపి బలపరిచిన పాంగి దుర్జో, పెదబయలు మండలం పెదకోడాపల్లి సర్పంచిగా వైసిపి బలపరిచిన బి.చిట్టిబాబు, హుకుంపేట మండలం శోభపేట సర్పంచిగా టిడిపి బలపరిచిన శశిభూషణ నాయుడు గెలుపొందారు. వార్డు స్థానాల్లో వైసిపి అభ్యర్థులు ఎక్కువ చోట్ల విజయం సాధించారు.

సిపిఎం బలపరిచిన అభ్యర్థి విజయం

మోతుగూడెం: చింతూరు మండలం గూడూరు ఐదోవార్డు స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికలో సిపిఎం బలపరిచిన అభ్యర్థి సోడె సూరయ్య మంచి మెజార్టీతో ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి కర్ణం ముత్తయ్యపై 24 ఓట్లు మెజారిటీ తో విజయం సాధించారు. గూడూరు ఐదో వార్డులో 92 ఓట్లు పోలింగ్ జరగగా , సిపిఎం అభ్యర్థికి 56 ఓట్లురాగా, ప్రత్యర్థి వైసిపి అభ్యర్థికి 24 ఓట్లు వచ్చాయి. 12 ఓట్లు చెల్లలేదు. వార్డు సభ్యునిగా విజయం సాధించిన సూరయ్యను సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, కమిటీ సభ్యులు పొడియం లక్ష్మణ్, మడకం రమేష్, గూడూరు శాఖ సభ్యులు నగేష్, మాధవి, బాడిస శేషు, బానిస భూమిక, మడకం నాగేష్, రాములమ్మ సీత తదితరులు అభినందించారు.

ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం బలపరిచిన అభ్యర్థిని గెలిపించిన ఓటర్లు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.కొత్తపల్లిలో వైసిపి అభ్యర్థి కారం సుబ్బమ్మ గెలిచారు.

వైసిపి అభ్యర్థి సీతారత్నం గెలుపు

రంపచోడవరం : డివిజన్ పరిధిలోని రంపచోడవరం మండలంలోని బండపల్లి పంచాయతీ 2వ వార్డు సభ్యునికి జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి పారా సీతారత్నం టిడిపి అభ్యర్థిపై నాలుగు ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

నడింపాలెంలో టిడిపి, మాకవరం, రేవళ్లలో వైసిపి విజయం

కొయ్యూరు: మండలంలో నడింపాలెం, పి. మాకవరం, రేవళ్ల పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. నడింపాలి వార్డు సభ్యురాలిగా టిడిపి అభ్యర్థి చెడ్డా లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన ఎన్నికలలో పి మాకవరం వార్డ్ సభ్యురాలిగా వైసిపి బలపరిచిన నర్సి పద్మలత 63 ఓట్లతో గెలుపొందారు. రేవళ్ల పంచాయతీలో ఎన్నికలు జరిగినప్పటికీ, టిడిపి ఓట్లను ఉద్దేశపూర్వకంగానే వైసిపి నేతలు గల్లంతు చేసారని ఆరోపణతో ఓటింగ్‌ను తెలుగుదేశం అభ్యర్థి బహిష్కరించారు. అయినప్పటికీ ఎన్నిక నిర్వహించగా, మొత్తం 139 ఓట్లలో 76ఓట్లు పోలవ్వగా టిడిపి అభ్యర్థికి ఆరు, నోటాకు ఒక ఓటురాగా, 69ఓట్లు సాధించిన వైసిపి అభ్యర్థి గోట్టుపల్లి బాల రాజులమ్మ 63ఓట్ల తేడాతో విజయం సాధిచారు.

సీలేరు సర్పంచ్‌గా దుర్జో విజయం

సీలేరు: సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలో వైసిపి, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి పాంగి దుర్జు 567 ఓట్లు సాధించి ఘన విజయం సాధించారు. సీలేరు సర్పంచ్ కొర్ర పరదేశి అకాల మరణంతో ఉప ఎన్ని నిర్వహించగా, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థి పాంగి దుర్జు, టిడిపి అభ్యర్థి దశరధ్ బిజెపి అభ్యర్థి పాంగి సుమిత్ర పోటీ పడ్డారు. 1089 ఓట్లు పోలవ్వగా, పాంగి దుర్జు సమీప టిడిపి అభ్యర్థి దశరథపై 140 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. టిడిపి అభ్యర్థి దశరధ్‌కు 427 ఓట్లు సాధించగా, బిజెపి అభ్యర్థి పాంగి సుమిత్రకు కేవలం 65 ఓట్లు వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ ధ్రువీకరణ పత్రాన్ని దుర్జోకు అందజేశారు. జీకే వీధి సిఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పటిష్ట భద్రత కల్పించారు.



పెదబయలులో ధ్రువీకరణ పత్రం ఇస్తున్న అధికారులు

వైసిపి, కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సవాలు

వైసిపి, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి దుర్జో విజయంతో ఆయా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి మండల నేతలు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపిపి బి. కుమారి ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ నేతలు కారే. శ్రీనివాస్ ఎం సత్తిబాబు దుర్జోను. పూలమాలలు వేసి, ఊరేగించి అభినందనలు తెలిపారు.కాగా తనను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని దుర్జో వెల్లడించారు. విజయోత్సవ ర్యాలీలో దారకొండ ఎంపిటిసి మామిడి రామన్న, సర్పంచి నడిగుట్ల రాజు వైసీపీ నాయకులు బుజ్జి స్వర్ణలత బుజ్జి వెంకటరావు చిరుపతి శివరాం సత్తిబాబు గణేష్ కాంగ్రెస్ నాయకులు వానపల్లి అప్పారావు బుజ్జి పాల్గొన్నారు.

పెదబయలు: పెదకోడాపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికకు, ఇంజెరిలో జరిగిన రెండు వార్డులకు ఎన్నికలకు సంబంధించి ఎన్నికలు సజావుగా జరిగాయి. పెదకోడాపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికకు ఐదుగురు పోటీ చేయగా మొత్తం 2915 ఓటర్లకు గాను 1766 ఓట్లు పోలయ్యాయి. పెదకోడాపల్లి సర్పంచ్ గా బట్టి చిట్టిబాబును ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. ఇంజరిలో రెండు వార్డులకు సంబంధించి నాలుగవ వార్డులో కొర్ర విజయ 74 ఓట్లతోనూ, 12వ వార్డులో వంతాల చిలకమ్మ 61 ఓట్లతో గెలుపొందారు.

హుకుంపేట:మండలం శోభకోట గ్రామంలో పంచాయతీ ఎన్నికలు శనివారం నిర్వహించారు. టిడిపి, వైసిపి, బిజెపి, పార్టీల నుండి నలుగురు అభ్యర్థులు పోటీ చేశారు.అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు శోభకోట గ్రామ సచివాలయంలో జరిగిన ఎన్నికల లెకింపు నిర్వహించారు. సర్పంచ్‌గా పలాసి శశిభూషణం నాయుడు 406 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఓటింగ్ కేంద్రాలను ఐటిడిఎ పిఓ వి అభిషేక్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రావు, సీఐ సుధాకర్ తదతరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల ప్రజలకు ఆధార్ సమస్యలు లేకుండా ప్రతి మండలంలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశామని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే అన్నారు. శనివారం ఐటిడిఎలోని పిఒ చాంబర్‌లో పిఎంయు అధికారులు, డిఎల్‌డిఒ, ఆధార్ కోఆర్డినేటర్లతో ఆధార్ సెంటర్లు ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ మారుమూల గ్రామాలలోని ప్రజలకు ఆధార్ నమోదుకు ఇబ్బందులు లేకుండాచూడాలన్నారు. మారేడుమిల్లి మండలంలో ఒక మొబైల్ ఆధార్ సెంటర్లో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక వారంలో 50 శాతం ఆధార్ నమోదు చేయాలని, మిగతా 50శాతాన్ని మరుసటి వారం పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీలో ఆధార్ కోఆర్డినేటర్ ద్వారా 16 కేంద్రాలు, గ్రామ సచివాలయాలలో 36 ఆధార్ సెంటర్లు పనిచేస్తున్నాయని, ఆయా గ్రామాల్లోని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..విద్యార్థుల ప్రభుత్వ పథకాలు ఇకవైసి సమస్యలున్న జాబితాను తయారుచేసి సమర్పించాలని పీఎంయు అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలోని 36 సచివాలయాలలో ఈనెల 22 నుంచి 2వరకు ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతమున్న ప్రదేశాలలో ఆధార్ సెంటర్ల పనితీరుపై ఆరా తీశారు.కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. కోటేశ్వరరావు. డివిజనల్ ఆధార్ కోఆర్డినేటర్ బి. డేవిడ్. ప్రోగ్రాం ఇన్ఫర్మేషన్ అధికారి. ఎస్‌జి మానవ్. క్షేత్రస్థాయి అధికారి పి. చంద్రకళ పాల్గొన్నారు.

నేడు జనసేన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -రంపచోడవరం : మండలంలోని బొర్ణగూడెం చోళ గెస్ట్ హౌస్‌లో ఆదివారం నియోజకవర్గ జనసేన ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహిస్తున్నట్లు జనసేన లీగల్‌సెల్ అధ్యక్షుడు కాకి స్వామి, మండల అధ్యక్షుడు పిఆర్‌పి శ్రీను తెలిపారు ముఖ్య అతిథులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, అరకు జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ వంపురి గంగులయ్య, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు హాజరౌతారన్నారు. సమావేశంలో జనసేన క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ, నూతన సభ్యుల చేరికలు ఉంటాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గ్రూప్ 1 విజేత జీవనకు ఘన సత్కారం

ప్రజాశక్తి-పెదబయలు రూరల్:మండల కేంద్రంలో గిరిజన ఉద్యోగులు, జేఏసి అధ్వర్యంలో గిరిజన సంఘ భవనంలో డిఎస్‌పిగా ఎంపికైన సిహెచ్. జీవనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన ఉద్యోగ సంఘాల జిల్లా నాయకులు ముక్కి శేషాద్రి, ల్లా అధ్యక్షులు ఎం రామకృష్ణ, మాజీ గిరిజన ఉద్యోగుల అధ్యక్షులు ఎం సిహెచ్. జీవన కు ప్రత్యేక అభినందనలు తెలిపారు, భవిషత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మన్యం నుంచి డిఎస్‌పిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భీముని రాంబాబు, ఎంపిటిసి సభ్యులు కె.బొంజుబాబు, గిరిజన సంఘం నాయకులు. బొండా సన్నిబాబు, స్వామి మాష్టర్ ,గంగాధరం, మత్స్య రాజు, నారాయణ పడాల్, పి తిరుపతిరావు జె.శ్రీను వాసరావు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీవనను అభినందిస్తున్న నాయకులు

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ధగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ప్రజాశక్తి -రంపచోడవరం : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కెమెరా సృష్టికర్త లూయిస్ ధగురే చిత్రపటానికి రంపచోడవరం ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత సీనియర్ ఫోటోగ్రాఫర్స్ శ్రీసూర్య స్టూడియో శ్రీనివాస్, భాను స్టూడియో మురళిలను సత్కరించారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై

21న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- అరకులోయ:పంచాయతీ కార్మికుల గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న పాడేరు జిల్లా కలెక్టరేట్ నిర్వహించనున్న ధర్నా ను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్ తెలిపారు. దీనిలో భాగంగా వర్కర్లకు కరపత్రాలను పంపిణీ చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రామాల్లోని వీధులను పరిశుభ్రం చేస్తూ, ప్రజల ఆరోగ్యం పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు.రెండేళ్లుగా బకాయి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. టెండర్స్ విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయాలని-010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, ఇపిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు.

కరపత్రాలు ఇస్తున్న నాయకులు

గంజాయి నియంత్రణపై ప్రచారం

ప్రజాశక్తి-పెదబయలు :మండలంలో వివిధ గ్రామాల్లో గంజాయి నిషేదించాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. మండలంలో మారుమూల గోమాంగి, గుల్లెలు, కుమ్మరివీధి గ్రామాల్లో ప్రచారం చేశారు. గంజాయి పంట వద్దు వాణిజ్య పంటలే ముద్దు అంటూ నినాదాలు చేశారు. గంజాయి రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పులి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పెదబయలు:మండల కేంద్రంలో విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బొండా సన్నిబాబు కోరారు. ఈ మేరకు శనివారం విద్యుత్ ఇంజినీర్ అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, పవర్ జెఎసి కాంట్రాక్టు కార్మికుల ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ లేబర్ కమిషన్‌కు పిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం చేసే అధికారం జెఎసికి లేదన్నారు. మూడు డిఎలు పెండింగ్‌లో ఉండగా ఒకటి మాత్రమే వాయిదాల పద్ధతిలో చెల్లించుటకు పవర్ జెఎసి అంగీకరించిందన్నారు. పాత పెన్షన్ విధానం మాటే ఎత్తలేదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను బడా కార్పొరేట్లకు ముత్తాజెప్పు తున్న యాజమాన్యం నష్టాల సాకుతో కార్మికుల వేతన ఒప్పందలలో అన్యాయం చేస్తోందని తెలిపారు. విద్యుత్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్ నాయకులు కె.తిరుపతి, బోండా విశ్వనాదం, తిరుపతి పడాల్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సన్నిబాబు

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలో బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశించారు. శనివారం ఐటిడిఎ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఎటిడబ్ల్యుఒలు, ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, సిలబస్‌ల పూర్తిపై చర్చించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ, చదువుకు దూరంగా ఉన్న బడిఈడు పిల్లలను గుర్తించి వారిపేర్లను ముందుగా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సచివాలయాల వారీగా ఎంతెంతమంది డ్రాపౌట్స్ ఉన్నారో సచివాలయాల వారీగా వెల్ఫేర్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ ఆధార్ కార్డులు ఉండాలని, కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం ఐటిడిఎఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను వినియోగించుకోవాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను పర్యవేక్షించి, సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. లెసన్ ప్లాన్ కోసం ఉపాధ్యాయులతో ఎన్నిసార్లు సమావేశాలు నిర్వహించారని హెచ్ఎంలను ప్రశ్నించారు.

సమావేశంలో మాట్లాడుతునన్న సూరజ్ గనోరే

డ్రాపౌట్ విద్యార్థుల వివరాలను ఎటిడబ్ల్యుఒలకు తెలియజేయాలన్నారు. మెనూ ప్రకారం భోజన అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. నాడునేడు పనుల పురోగతిపై ఆరా తీశారు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏజెన్సీ విద్యాభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుందో సలహాలు, సూచనలు ఇవ్వాలని సీనియర్ హెచ్ఎంలను కోరారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని హెచ్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆదేశించారు ఆశ్రమ పాఠశాలలకు నాణ్యమైన నిత్యావసరాలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు, సిబ్బంది బయటకు వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల వేళల్లో తల్లిదండ్రులు, ఇతరులెవరినీ లోనికి అనుమతించవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సమావేశంలో ఎటిడబ్ల్యుఒలు రామ తులసి, హాసిని, శాంతి, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరెంటిండెంట్ బి కిషోర్. సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, ఆర్ వెంకటేశ్వరరావు,చక్రధర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు బీమా సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి హుకుంపేట: మండలంలోని కొట్నా పల్లి పంచాయతీ మారేళ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన అంగన్వాడీ టీచర్ పొట్టంగి బుల్లెమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు, ఆదివాసి గిరిజన మహిళా సంఘం నేతలి అప్పలకొండపడాల్, హైమా డిమాండ్ చేశారు. సిఐటియు,ఆదివాసి గిరిజన మహిళా సంఘం నేతలు తదితరులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్ మృతి చెందితే కనీసం ఇన్సూరెన్స్ వంటి సౌకర్యం లేకపోవడం విచారకరమన్నారు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుందని, తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లకు ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా వంటి సౌకర్యాలు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

పరామర్శిస్తున్న నాయకులు

గ్యాస్ గోదాముకు దారేదీ ?

బురదమయమైన రహదారితో అవస్థలు
పట్టించుకోని అధికారులు, నేతలు

బురదతో నిండిన గ్యాస్ గొడౌన్ దారి

ప్రజాశక్తి -రంపచోడవరం : బురదమయమైన అధ్వానరోడ్డుతో జిసిసి గోడౌన్ నుంచి గ్యాస్ సిలిండర్ తెచ్చుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని గ్యాస్ వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న జిసిసి గ్యాస్ గొడౌన్‌కు వెళ్లే దారిలోని గోతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నీటితో నిండి, బురదమయమై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇక గ్యాస్ సిలెండర్‌ను బైక్ లేదా, సైకిలుపై పెట్టి తీసుకు రావడమంటే, ఈ మార్గంలో ప్రాణసాహసమనే చెప్పాలి, నీటితో నిండిన గోతుల్లో ఎక్కడ ఎంత లోతుందో తెలియకపోగా, బురద, జారుడుమయం కావడంతో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా, వాహనం స్పీడ్ పెంచినా స్కిడ్ అయి ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో జిసిసి గ్యాస్ గొడౌన్, జిసిసి డిఎం ఉన్న ఈ మార్గంలో రోడ్డును బాగుచేయడమో, లేకుంటే గ్యాస్ గొడౌన్‌ను ప్రస్తుత వర్షాల సీజన్‌లో ఏదైనా సురక్షిత ప్రాంతానికైనా తరలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు

వలిసెల రైతుల ఉపాధికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో ప్రాంతంలో వలిసెలు సాగు చేసే గిరి రైతుల జీవనోపాధికి ప్రత్యేక చర్యలు చేపడతామని గీతం, డీఎసీ ప్రోజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ శరత్ బాబు అన్నారు. పాడేరు మండలంలో వనుగుపల్లి పంచాయతీ జామిగుడ గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వలిసెలు విత్తనాల పంపిణీ, క్షేత్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన్యంలో వలిసెలు సాగుకు సరైన ప్రోత్సాహం లేక సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ఆ పరిస్థితిని గుర్తించిన తాము భారత ప్రభుత్వం డిపార్టుమెంట్ సైన్సు, టెక్నాలజీ, సీడ్ విభాగం ఆర్థిక సహాయంలో వలిసెలు సాగును సంపూర్ణంగా ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా పాడేరు క్లస్టర్లో 500 కుటుంబాలు, అరకులోయ క్లస్టర్ 500 కుటుంబాలకు వలిసెలు సాగు, దానికి అనుబంధంగా తేనెటీగల పెంపకానికి ప్రోత్సాహించేందుకు చర్యలు చేపడుతు న్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో వలిసెల నూనె, తేనే ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.రానున్న మూడేళ్లు అందుకు అవసరమైన విత్తనాలు, శిక్షణలు, యంత్ర పరికరాలను అందిస్తామని పేర్కొన్నారు. భవిష్యత్ లో గిరిజన కుటుంబాలు వలిసెలు, తేనెలో ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా వలిసెలు సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సందీప్ రైతులకు వివరించారు. అనంతరం గిరిజన రైతులకు ఉచితంగా మేలైన వలిసెలు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గీతం, డీఎసీ ప్రోజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.కిరణ్, ప్రాజెక్టు అసిస్టెంట్లు శ్రీనివాస్, నాగరాజు, నాగేశ్వరరావు, నాగేంద్ర, గిరిజన రైతులు పాల్గొన్నారు.

వలిసె విత్తనాలు పంపిణీ చేస్తున్న గీతం ప్రొఫెసర్ శరత్ బాబు

అటవీ హక్కుల చట్ట సవరణ.. గిరిజనులపై దాడే..

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అటవీ హక్కుల చట్టాన్ని ప్రస్తుత చట్ట సవరణ ఆదివాసీల మనుగడపై మరో దాడిగానే గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ సంరక్షణ చట్టం-1980 సవరణ ఆదివాసీల రిజర్వేషన్లు, మనుగడపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడులకు ఇదొక ఉదాహరణగా భావిస్తున్నామన్నారు. అటవీ భూములను ఇతర అవసరాల కోసం యథేచ్ఛగా మళ్ళించేందుకు అడ్డుగా ఉన్న నిబంధనలకు తూట్లు పొడిచింది. సంరక్షణ ముసుగులో అడవులను ప్రైవేటుపరం చేయడం వాటి నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కుదించి, కేంద్రానికి మరిన్ని అధికారాలను దఖలు పరిచేలా చట్టానికి సవరణలు చేశారు. కేంద్ర ప్రభుత్వ మోసకారితనానికి ఈ చట్ట సవరణ ఒక మచ్చుతునక. ఇది అటవీ భూముల మళ్ళింపును, గిరిజన హక్కులపై దాడులను చట్టబద్దం చేస్తుంది. మొత్తం మీద అడవులను ప్రైవేటీకరించే ఒక పెద్ద పథకంలో భాగమే అటవీ హక్కుల సవరణ. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ అటవీ హక్కుల సవరణ గిరిజనుల హక్కులపై పరోక్షయుద్ధాన్ని ప్రకటించడమే. కార్పొరేట్లకు అడవులపై చట్టబద్ధత కల్పించడానికి ఆదివాసీలపై మోడీ ప్రభుత్వ దాడి. అటవీ చట్టానికి తెచ్చిన సవరణతో అటవీ ప్రాంతాల్లో కార్పొరేట్లు యధేచ్ఛగా ఏ ప్రాజెక్టునైనా గ్రామసభల ఆమోదం లేకుండా చేపట్టవచ్చు. ఆదివాసీలకు నిలువ నీడ లేకుండా చేసే కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ అటవీ హక్కుల చట్టం సవరణను అందరూ వ్యతిరేకించాలని ఆదివాసీ గిరిజన సంఘాల నేతలు కోరుతున్నారు. అటవీ చట్ట సవరణతో రాష్ట్రాల హక్కులకే కాకుండా, విలువైన దేశ సంపద కార్పొరేట్ లు, విదేశీ చేతుల్లోకి వెళ్లిపోతుంది. అటవీ సంరక్షణ చట్టం 1980 ప్రకారం అటవీ భూమిని ఇతర ప్రయోజనాలకు వినియోగించాల్సి వస్తే తప్పనిసరిగా గ్రామసభ అనుమతి, నిర్వాసితులకు నష్టపరిహారం, అడవులను పెంచేందుకు ప్రత్యేక భూమి కేటాయించాలి. 1980 అటవీ చట్టంలో అటవీ భూములను ఇతర అవసరాలకు, ప్రాజెక్టులు, మైనింగ్, బాక్సైట్ తవ్వకాలు లాంటివి గ్రామసభలు లేకుండా చేపట్టడం కుదరదు. గ్రామసభల ఆమోదం తప్పనిసరి. పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుంచి ముందస్తు అనుమతులు లేకుండా అటవీ ప్రాంతంలో ఆటవియేతర కార్యకలాపాలు జరపకుండా అటవీ సంరక్షణ చట్టం-1980 నిషేధిస్తుంది. ఇప్పుడు ఈ తాజా చట్ట సవరణ ద్వారా గ్రామసభ అవసరాన్ని రద్దు చేస్తోంది. కార్పొరేట్ శక్తులకు అడ్డుగా ఉన్న ఈ నిబంధనలను సవరించేందుకే అటవీ హక్కు సవరణకు బిజెపి ప్రభుత్వం పూనుకుంది. ఆదివాసీల హక్కులను హరిస్తూ గ్రామసభకున్న అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అటవీ భూమిని ఇతర అవసరాలకు మళ్ళించాలంటే అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద అటవీ హక్కులను సంపూర్ణంగా అమలు జరపాలి. ఆ అవసరం లేకుండానే ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలకు అటవీ భూమిని మళ్లించేందుకు నూతన అటవీ సంరక్షణ చట్టంలో వీలు కల్పించిన నియమాలు అమలైతే అడవి నుండి ఆదివాసులను నెట్టివేయడమౌతుంది. అటవీ హక్కుల అమలు విషయంలో గ్రామసభ పాత్రను, అటవీ భూమి మళ్లింపు విషయంలో వాటి అనుమతి అవసరం లేకుండా బిజెపి ప్రభుత్వం మొండిగా గ్రామసభ, అటవీ హక్కుల చట్టాన్ని నీరుగారుస్తూ ఆదివాసీల హక్కులను హరిస్తోంది. అలాగే పీసా చట్టానికి భిన్నంగా నూతన అటవీ సంరక్షణ చట్ట సవరణతో రాజ్యాంగ లక్ష్యాలను తూట్లు పొడుస్తోంది. వనరుల నిర్వహణ, హక్కుల నిర్ధారణ అమలు చేసే గ్రామ సభలకున్న అధికారాలను నూతన అటవీ సంరక్షణ చట్ట నియమాలు కనీసం ప్రస్తావించలేదంటే ఆదివాసీలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్ధమవుతుంది. అడవులను అమ్మేసి, వ్యాపార వనరుగా మార్చటమే కేంద్రం అసలు కుట్ర. ఈ చట్ట సవరణలను సిపిఎం, ఆదివాసి గిరిజన సంఘం, గిరిజన ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. .

అమల్లోకి వస్తే తీవ్ర నష్టం

అటవీ హక్కుల చట్టాన్ని ప్రస్తుత చట్ట సవరణ అమల్లోకి వస్తే గిరిజనులకు తీవ్ర నష్టం. ఏజెన్సీ ప్రాంతం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఏజెన్సీలో ఏదైనా చేయాలంటే గ్రామసభల తీర్మానం తప్పనిసరి. కొత్త చట్టంలో గ్రామసభల ప్రాధాన్యతను పూర్తిగా లేకుండా చేశారు. దీంతో జిల్లా అధికారులే ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకుని ఏజెన్సీ ప్రాంతంలో అమలు చేసే అధికారం రానుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినట్లు అధికారులు వ్యవహరించే అవకాశం ఉండడంతో గిరిజనుల పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది.

కె.సురేంద్ర
ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గిరిజన హక్కులపై దాడి

గిరిజనుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోంది. ఏజెన్సీలోని గిరిజన హక్కులను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాలుగా దాడి చేస్తున్నాయి. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో ఆయా మండలాల్లోని గిరిజనుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. అటవీ చట్ట సవరణ అమలు జరిగితే ఏజెన్సీలోని గిరిజనుల హక్కులు పూర్తిగా కనుమరుగు కానున్నాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ప్రయోజనాలకు, రిజర్వేషన్లకు, మనుగడకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ఈ సవరణతో అటవీ వనరులపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీల ఉనికి ప్రశ్నార్ధకం అవుతుంది.

పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

పర్యావరణానికి పెను ప్రమాదమే..

అడవులు లేకపోవడంతో పర్యావరణానికి సైతం పెను ప్రమాదం ఏర్పడనుంది. అటవీ చట్టంలో మార్పులు మరింత పర్యావరణ నష్టానికి మార్గం సుగమం. అటవీ అనుమతుల నిబంధనలను, పర్యావరణ సంరక్షణ నిబంధనలను సడలించడమే. దేశంలో కాలుష్య సంబంధిత సమస్యలు పెనుసవాళ్ళుగా మారాయి. వీటి నియంత్రణ, పర్యావరణాన్ని రక్షించడానికి ప్రభుత్వం రూపొందించిన చట్టాలను నీరుగార్చడమే. విలువైన ఔషధ మొక్కలు కనుమరుగై ఆయుర్వేదానికి ముప్పు ఏర్పడుతుంది. వన్యప్రాణుల శ్రేయస్సు దష్ట్యా పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వం బాధ్యతగా గుర్తించాలి.

పాలికి లక్కు
ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

కార్పొరేట్ చేతుల్లోకి అటవీ సంపద..!

అడవి నుంచి గిరిజనులను తరిమేసి అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బిజెపి సర్కార్ కుట్ర. ఇందులో భాగంగానే 2006 అటవీ హక్కుల చట్ట సవరణలు. ఏజెన్సీలోని గనులను, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టనున్నారు. ఏజెన్సీలో పలు ప్రాంతాల్లో ఉన్న బాక్సైట్ వంటి గనులను కార్పొరేట్ కు అప్పగించి గిరిజనులను తరిమేసే పరిస్థితి రానుంది. బిజెపి సర్కార్ చేస్తున్న కుట్రలతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరగనుంది. కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కె.రాధాకష్ణ
గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగం, వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ సంయుక్త నిర్వహణలో రెండు రోజుల ఫొటో ప్రదర్శనను ఉక్కునగరంలో నిర్వహించారు. శనివారం ప్రారంభ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ ముఖ్యఅతిథిగా హాజరై ఫొటో ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను ఎంతో ఉత్సాహంతో తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చిత్రాలు చరిత్రను చిరకాలం భద్ర పరుస్తాయన్నారు. రాబోయే తరాలకు చరిత్రను అందిస్తాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మాణ, ప్రారంభ దశ నాటి చిత్రాలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. చక్కటి ఫొటో ప్రదర్శనను ఏర్పాటుచేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉక్కు చీఫ్ జనరల్ మేనేజర్ జి.గాంధీ, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి ఆర్‌పి.శర్మ, వాల్తేరు ఫొటోగ్రాఫిక్ సొసైటీ అధ్యక్షులు పిఎన్.సేథ్, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు జగపతిరాజు, కోశాధికారి వివి.రామరాజు, సహాయ కార్యదర్శి రమేష్‌చంద్రబోస్, ప్రతినిధులు సన్యాసిరావు, బిహెచ్.శ్రీనివాస్, డివి.రమణ, ప్రసాద్, బ్రహ్మాజీ, జిఎన్.మూర్తి, ఎం.కనకరాజు, వి.డెంటల్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ రమేష్, డిఎవి స్కూల్ విద్యార్థులు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

చోడవరం : అంతర్జాతీయ ఫోటో దినోత్సవం సందర్భంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చోడవరంలో కేక్ కట్ చేశారు. ప్రపంచ ఫోటో పితామహుడు లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొంగరాల సురేష్, రాజాన శివకుమార్, స్వామి పట్నాయక్, టి సుధా, ఏ తులసీరావ్, సభ్యులు ప్రభాకర్, సతీష్, దుర్గారావు పాల్గొన్నారు.



రాజుపాక గ్రామం సమీపంలో కొండలపైకి పొగ మంచు

ఆహ్లాదకరంగా పొగమంచు

ప్రజాశక్తి-అనంతగిరి:గిరిజన ప్రాంతం అంటేనే పచ్చటి అడవులు, ఎత్తైన కొండలు కూడి ఉన్న ప్రాంతాలు. దీనికి తోడు చూడదగ్గట్టు కనువిందులుగా చేసే ప్రముఖ పర్యటక ప్రాంతాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చల్లటి వాతవరణం నడుమ ఆకాశాన్ని తాకే తెల్లటి పొగ మంచు కొండ కోనలను తాకుతూ గిరి పల్లెల సైతం కమ్మేస్తున్నాయి. గ్రామాల సమీపంలోని పొదలు, .అడవులలో మేతకు వెళ్లిన మూగజీవులను ఈ పొగ మంచు కప్పేస్తుంది. అనంతగిరి, అరకు ప్రముఖ పర్యటక ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు వేల సంఖ్యలో సందర్శిస్తుంటారు. టైటా, డమ్ముకు, అనంతగిరి మార్గమధ్య ఎత్తైన కొండల్లో పొగ మంచు కమ్మి ఉండటంతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -హుకుంపేట:చదువులమ్మ దేవి సరస్వతి విగ్రహం ఆవిష్కరించడం విద్యకు దగ్గర అవ్వడమే అని వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు గాయత్రి, పూలవర్తి వరహాలరావు అన్నారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.అనంతరం వారు మాటత్లాడుతూ,క్రీస్తు శేషులు పులవర్తి సత్యనారాయణ వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు పూలవర్తి వరహాలరావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారనారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపల్ కోటగుళి సింహాసనం నాయుడు, పాడేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటుచేసిన క్లబ్ అధ్యక్షులు

అంగన్‌వాడీ, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని కొండిబ పంచాయితీ పరిధి తోకవలస గ్రామంలో మినీ అంగన్వాడీ కార్యకర్త, ఎన్‌ఆర్ పురం పంచాయతీ పరిధి పెద్దకోనేల అంగన్వాడి ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడిపిఓ సంతోష్ కుమారి పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోపు మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జూ పార్కుకు ఆడ సింహం రాక

ప్రజాశక్తి - ఆరిలోవ : జంతు మార్పిడి విధానంలో భాగంగా గుజరాత్‌లో గల నక్కర్‌బాగ్ జులాజికల్ గార్డెన్ నుంచి వైజాగ్ ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలకు రెండున్నర సంవత్సరాల ఆడ సింహాన్ని తీసుకొచ్చారు. నక్కర్‌బాగ్ జంతు ప్రదర్శన శాల వెటర్నరీ వైద్యుడు ప్రశాంత్ మారు, వైజాగ్ జూ వైద్యుడు డాక్టర్ ఫణీంద్ర, జూనియర్ వెటర్నరీ డాక్టర్ పురుషోత్తం, సిబ్బంది సంరక్షణలో గుజరాత్ నక్కర్‌బాగ్ జూ పార్కు నుంచి శుక్రవారం అర్ధరాత్రి వైజాగ్ జూ పార్కుకు ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. వైజాగ్ జూ పార్కు నుంచి ఒక మగ, ఒక ఆడ అడవి కుక్కలను తీసుకెళ్లనున్నారు. కొత్తగా వచ్చిన ఆడ సింహం సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. ఇప్పటికే జూ పార్కులో ఉన్న ఒక జత సింహాలతో పాటు సింహాల గుంపును ఏర్పరచడంలో సహాయ పడుతుందన్నారు. కొత్తగా వచ్చిన ఆడ సింహాన్ని ప్రొటో కాల్ నిబంధనల ప్రకారం కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతామన్నారు.

అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీదేవి

వినియోగదారుల కమిషన్ నుంచి..
ప్రతివాదులకు నేరుగా నోటీసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వినియోగదారుల కమిషన్ నుంచి ప్రతివాదులకు. నేరుగా నోటీసులు అందేలా చర్యలు చేపడుతున్నట్టు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి తెలిపారు. శనివారం విశాఖ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కన్జ్యూమర్ అధికారులు, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు, న్యాయవాదులతో వినియోగదారుల అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కమిషన్ నుంచి నోటీసు వెళ్లినా, సరిగా చేరకపోవడం, చేరినా.. ప్రతివాదులు సరిగా స్పందించకపోవడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రతివాదులకు సక్రమంగా నోటీసులు అందేలా పోలీస్ శాఖ నుంచి ఓ అధికారిని నియమిస్తున్నట్టు ఆమె తెలిపారు. నోటీసులు అందినా, స్పందించకపోతే ప్రతివాదులపై చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. వినియోగదారుల కమిషన్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఫోరం సభ్యులందరిపైనా ఉందన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు దీనిపై వినియోగదారులను చైతన్యం కలిగించే కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డిసిడిఆర్ సి-1 అధ్యక్షురాలు జి.తనూజ, సమావేశం కన్వీనర్ జి.వెంకటేశ్వరి, ఫోరం సభ్యులు పి.విజయదుర్గ, డాక్టర్ కె.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

వినియోగదారుల చట్టం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (డిసిడిఆర్) - 1 అధ్యక్షురాలు జి.తనూజ అన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం 'మేలుకో... హక్కులు తెలుసుకో, అందరి చుట్టం.. వినియోగదారుల రక్షణ చట్టం' పేరుతో కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రూపొందించిన బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులు రక్షణ చట్టంపై కరపత్రాలు, పుస్తక ప్రచురణల ద్వారా వినియోగదారుల సంఘాలు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మోసాలపై అప్రమత్తంగా ఉండటానికి ప్రజలకు సమాచారం అందజేయడం, విషయ పరిజ్ఞానం కల్పించడం ధ్యేయంగా స్వచ్ఛంద సంస్థలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో కన్సూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ, డిసిడిఆర్ -2 అధ్యక్షురాలు జి.వెంకటేశ్వరి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.సూర్యప్రకాశరావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు అథారిటీని సందర్శించిన పిపి.వావా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారి గౌరవ సభ్యులు డాక్టర్ పిపి.వావా శనివారం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించారు. పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం పోర్టులో జరుగుతున్న కార్యకలాపాలు, ఎగుమతులు, దిగుమతులు, యాంత్రీకరణ, మౌలిక వసతులు, ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలను దూబె పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డిసెంబర్ 2021లో పోర్టును సందర్శించిన సమయంలో లేవనెత్తిన అంశాల పురోగతిపై డాక్టర్ వావా సమీక్ష జరిపారు. పోర్టులో సఫాయి కర్మచారీల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా దూబె వివరించారు. ఈ నెల 23న విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ -2023 రోడ్ షోలో పాల్గొనాల్సిందిగా కోరారు. పోర్టులో సఫాయి కర్మచారిలకు అందుతున్న వసతుల పట్ల వావా సంతృప్తి వ్యక్తం చేశారు.

'సర్దుబాట్లు'.. విద్యార్థులకు పాట్లు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రయివేటు పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుంటే, విద్యార్థులను ఆకర్షించేలా మౌలిక వసతులు కల్పిస్తుంటే, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలన్న ఆలోచనలో తల్లిదండ్రులు పడేలా ముస్తాబు చేస్తుంటే... విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అంతా అనుకున్నారు. భౌతిక మార్పును చూసి భ్రమ పడ్డారు. ఒక విధంగా చెప్పాలంటే బలివ్వడానికి ముందు మేకను తయారుచేసిన కసాయిలా, లక్షలు ఖర్చు పెట్టి పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం మార్చింది. మేకను తయారుచేసిన కసాయిని మెచ్చుకున్నట్లే, నాడు - నేడు కింద పాఠశాలలను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వాన్ని గిట్టనివారు సైతం మెచ్చుకున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి దిగొచ్చిన ప్రభుత్వంగా చెప్పుకున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు వర్ణించారు. ఇదంతా నాణేనికి ఒకవైపు. రెండోవైపు చూస్తే, తన కసాయి తనం బయటపడకుండా మేకను తయారు చేసినట్లు ప్రభుత్వ విద్యను చాపలా చుట్టడానికి ముందు ప్రభుత్వ పాఠశాలలను ఈ సర్కారు తయారుచేసింది. ఒక రకంగా నిర్మాణ పనులకు సామగ్రిని పంపిణీ చేసే కాంట్రాక్టు తీసుకొని లాభపడింది. ఆ పనులు పూర్తయ్యాక ఆ పాఠశాలలపైన విరుచుకుపడుతోంది.

నూతన విద్యా విధానం పేరుతో తీసుకున్న నిర్ణయాలు విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించేలావున్నాయి. అందుబాటులో వున్న ప్రాథమిక విద్యను దూరం చేస్తోంది. విద్యపై పెడుతున్న ఖర్చును తగ్గించుకోవాలని చూస్తోంది. భవిష్యత్తులో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకుండా మిగులు ఉపాధ్యాయులను తేల్చే పనిలో వుంది. 2022 ఆగస్టు 31 నాటికివున్న పాఠశాలల్లో విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఈ ఏడాది జూన్‌లో హేతుబద్ధీకరించి ఉపాధ్యాయులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఈ బదిలీ అయిన 1500 మంది ఉపాధ్యాయులకు ఈ నాటికీ జీతాలు ఇవ్వలేదు. 262 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గింది. తగ్గిన విద్యార్థులను ప్రామాణికంగా తీసుకుంటే మిగులు ఉపాధ్యాయులను తేల్చవచ్చని భావించిన ప్రభుత్వం వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను చేపట్టింది. ఆ పేరుతో చేసిన సర్దుబాట్లతో ఉమ్మడి జిల్లాలో సుమారు 431 ఎస్‌జిటిలను మిగులుగా విద్యాశాఖ గుర్తించింది. ఇంకొంతమంది మిగులు సబ్జెక్టు టీచర్లున్నట్లు తేల్చింది.

ఉపాధ్యాయుల సర్దుబాటు పేర మిగులు ఉపాధ్యాయులను తేల్చాలన్న కుట్ర తప్ప విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలన్న సత్సంకల్పం ప్రభుత్వంలో ఏ కోశానా కన్పించడం లేదు. విద్యా శాఖ నిబంధనల ప్రకారం ఆగస్టు 31 వరకు విద్యార్థుల ప్రవేశాలకు గడువు వుంది. ఈ గడువు పూర్తయ్యాక అప్పటి విద్యార్థుల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటుచేస్తే, కొంతైనా చెప్పుకోవడానికి సహేతకత వుండేది. బదిలీ చేసిన మూడు నెలల వ్యవధిలో మళ్లీ సర్దుబాటు అంటే ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురికావడమే కాదు, విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులు వెళ్లిపోతే విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన సమస్య ఏర్పడుతుంది. ఈ మాత్రం దూరదృష్టి ప్రభుత్వానికి లేకకాదు. పేద పిల్లలు చదువులెలాపోయినా విద్యపై పెడుతున్న ఖర్చును తగ్గించుకొని ప్రయివేటు విద్యను ప్రోత్సహించాలన్న దురుద్దేశం ప్రభుత్వాధినేతల మనసునిండావుంది. అందుకనే... విద్యార్థుల ప్రవేశాల గడువుకు నెలముందున్న విద్యార్థుల సంఖ్యను తీసుకొని ఉపాధ్యాయుల సర్దుబాటు చేసింది. ఉపాధ్యాయులను తగ్గించాలన్న కుట్రలో భాగంగా ఆగస్టు 1 నుంచి 31 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులను పరిగణనలోకి తీసుకోవడంలేదు. విద్యా ప్రమాణాలు దిగజార్చేలా ప్రభుత్వ నిర్ణయాలుండడంతో సర్దుబాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని, ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆందోళన అనివార్యమైంది.

నేడు ఇతిహాస్ కే పన్నోంసే టికెట్ షో

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇతిహాస్ కే పన్నోంసే (చరిత్ర పుటల్లోంచి) శీర్షికన భారత స్వతంత్ర సంగ్రామంలో వీరోచితంగా పోరాడి అసువులుబాసిన యోధానుయోధులను కళ్లకు కట్టినట్టు చూపెట్టే కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగనుంది. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముంబయికి చెందిన హెరిటేజ్ స్టోరీస్ అండ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ (హెచ్‌ఎస్‌పిఎ) సంస్థ అరుదైన ఈ సంగీత, నృత్య, కథా కారర్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ముంబయి, చెన్నయ్, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాలకు చెందిన విశేష నైపుణ్యాలున్న కళాకారుల అరుదైన ప్రదర్శన ఇది. భారత దేశం నలు చెరగుల నుంచి పేరెన్నికగన్న స్వాతంత్ర్య సమర యోధులు, వారి వారసులు ఈ కార్యక్రమాన్ని స్వయంగా తిలకించి తమ అనుభవాలు పంచుకోవడానికి నగరానికి రానున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నిర్వాహకులు తెలుగు, ఆంగ్ల భాషలలో నిర్వహించే ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఆస్వాదించాలనే ఆసక్తి ఉన్నవారు రూ.250 చెల్లించి టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సిరిపురం కూడలిలోని స్వీట్ ఇండియా, లాసన్స్ బే కాలనీలోని బుకింగ్ మ్యాజిక్‌లో టికెట్లు విక్రయిస్తారు. మరిన్ని వివరాలకు హెచ్‌ఎస్‌పిఎ ప్రతినిధిని 9167400670 నెంబర్‌లో సంప్రదించాల్సిందిగా నిర్వాహకులు సూచించారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు.

మాట్లాడుతున్న డాక్టర్ వావా

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించేలా చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంఎస్ యాక్ట్ - 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని నేషనల్ కమిషన్ ఫర్ సఫాయి కర్మచారి గౌరవ సభ్యులు డాక్టర్ పిపి.వావా అన్నారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జివిఎంసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మాన్యువల్ స్కావెంజింగ్‌ను అంతం చేయగలదని తెలిపారు. అంతేగాకుండా మురుగునీటి కార్మికుల ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని తెలిపారు. రాష్ట్రాలు, మున్సిపాలిటీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందని అన్నారు. నిర్ణీత గడువులోగా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా వారికీ విద్య, వైద్య ఆరోగ్య రంగాలలో సహకారం అందించాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు పునరావాసం కల్పించడమే కాకుండా గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు ప్రత్యామ్నాయ వృత్తుల్లో మాన్యువల్ స్కావెంజర్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకుల్లో మాన్యువల్ క్లీనింగ్‌ను నిలిపివేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, దానికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాగాన్ని అయన ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, డిసిపి విద్యాసాగర్ నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - భీమునిపట్నం : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన తలపెట్టిన 'విద్యార్థి సంఘర్షణ సైకిల్ యాత్ర' శనివారం భీమునిపట్నంలో ప్రారంభమైంది. గాజువాక వరకూ సాగే ఈ సైకిల్ యాత్రలో హాస్టళ్లు, ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను తెలుసుకోనున్నారు. యాత్ర తొలిరోజు భీమిలిలోని ఎస్‌సి, బిసి సమీకృత బాలురు, బాలికల కళాశాల హాస్టళ్లను, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను సంఘం నాయకులు సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సొంత భవనాలు లేని చోట ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేయాలని, మరమ్మతుకు గురైన హాస్టళ్ల భవనాలకు నాడు - నేడు నిధులతో మరమ్మతులు చేపట్టాలని కోరారు. పీజీ విద్యార్థులకు విద్యా దీవెన అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల సామాన్యులు విద్యకు దూరమవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.రామ్మోహనరావు, విశాఖ జిల్లా గర్ల్స్ కన్వీనర్ జి.పల్లవి, శశి కుమార్, గుణశేఖర్, కౌశిక్, సూర్య, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.